నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

12 | నిజామాబాద్ శనివారం 16 నవంబర్ 2024 | ADILABAD NIRMAL




బాసర : గోదావరి నదికి హారతి ఇస్తున్న అర్చకులు, సిబ్బంది, భక్తులు

## పెద్దపులి సంచారం

### భయాందోళనలో పెంబి తండా వాసులు



పులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

పెంబి, నవంబర్ 15: మండలంలోని పెంబి తండాలో పెద్దపులి సంచరించడం గ్రామస్తులకు భయాందోళనకు గురి చేస్తున్నది. బావాపూర్(ఆర్) లో గురువారం గేదె, దూడపై పులి దాడి చేసిన విష యం తెలిసిందే. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో పెంబి తండాకు చెందిన రోహిదాస్, మోతీలాల్ గ్రామ శివారులోని చేలల్లోకి పనులకు వెళ్లిన వారికి పులి కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎఫ్ఆర్వో రమేశ్‌రావుతో పాటు ఎస్ఐ సాయికుమార్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. పులి పాదముద్రలను గుర్తించి ధ్రువీకరించారు. పులి సంచారంపై ఇటిక్యాల, పుల్గంపాండ్రితో పాటు ఆయా గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. రెండు రోజుల పాటు పంట చేలల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. రైతులు పంటల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ప్రతాప్ నాయక్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎదులాపురం : సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు



ఎదులాపురం : గోపాల కృష్ణ మఠంలో ..

# కనుల పండువగా కార్తీక పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- నదుల్లో పుణ్యస్నానాలు.. గంగమ్మ తల్లికి మొక్కులు
- వైభవంగా తులసీ పూజలు.. సత్యనారాయణ స్వామి వ్రతాలు

నమస్తే బృందం : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం కనుల పండువగా జరిగాయి. భక్తులతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. ఉసిరి కొమ్మలను తులసీ కోటలో ప్రతిష్ఠించి దీపాలు వెలిగించారు. ఆయాచోట్ల గోదావరి, పెన్‌గంగ, ప్రాణహిత నదులతో పాటు వాగుల్లో పుణ్యస్నానాలు ఆచరించి గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. కార్తీక దీపాలు వెలిగించారు.

### బాసర గోదావరి తీరంలో హారతి

బాసర, నవంబర్ 15 : బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరికి నదికి విశేష హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి నదీ తీరంలో కార్తీక దీపాలు వెలిగించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపాటిల్, ఆలయ ఈవో విజయరామారావు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### సత్యనారాయణ స్వామి వ్రతాల్లో 700 జంటలు

జైనథ్/ఎదులాపురం, నవంబర్ 15: జైనథ్‌లోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణలో సుమారు 700 పైగా జంటలు సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్నట్లు ఆలయ అర్చకుడు వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రాకేశ్ రెడ్డి, ఈవో వామన్‌రావ్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని అతి పురాతన మంగ మఠం లో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జైనథ్ : సత్యనారాయణ వ్రతాన్ని ఆచరిస్తున్న మాజీ మంత్రి దంపతులు

### ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి : రామన్న

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జైనథ్ మండలకేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొనసాగిన కార్తీక సామూహిక సత్యనారాయణ రథోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న రమాదేవి దంపతులు సత్యనారాయణ వ్రతాన్ని ఆచరించారు. భక్తుల సౌకర్యార్థం జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.



దస్తురాబాద్ : గొడిసేర్యాల ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలను వెలిగిస్తున్న మహిళలు



తలమడుగు : దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పడ్తనపల్లిలో వరి కోతలు



గొల్లపల్లిలో రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

# సన్నాలకు బోనస్.. అంతా బోగస్

- ధాన్యం పొడవు, వెడల్పు కొలిచాకే సన్నాల నిర్ధారణ
- అన్ని రకాలకు ఇవ్వకుండా సవాలక్ష కొర్రీలు
- తెలుసుకోకపోతే అన్నదాతలకు ఇబ్బందులే
- ఉమ్మడి జిల్లాలో పండించిన దాదాపు 50 శాతం సన్న రకాలు ప్రభుత్వ లిస్టులో లేనివే

**33 రకాలకే ఇస్తామంటూ సర్కారు మెలిక**

పెద్దంపేటలో ధాన్యం రాశులు



మంచిర్యాల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మద్దతు ధరకు ధాన్యం కొనడంతో పాటు సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఉత్త బోగసే అని తేలిపోయింది. సన్నాలకు బోనస్ ఇచ్చేందుకు కోట్లాది రూపాయాలు కేటాయించామని గొప్పలు చెప్పుకుంటున్న సర్కారు.. 33 రకాలకే బోనస్ అంటూ మెలిక పెట్టింది. కొన్ని రకాల ధాన్యాల పేర్లు చెప్పి, వాటినే సన్నాలుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఇక ఈ విషయం తెలియని రైతులు సన్న వడ్లు పట్టుకొని కొనుగోలు కేంద్రానికి వెళ్తే చాలు.. క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందనుకుంటున్నారు. కానీ.. అసలు విషయం ఏమిటంటే ప్రభుత్వం చెప్పిన 33 రకాలకే బోనస్ వర్తిస్తుంది. ఆ 33 రకాలను కూడా గ్రేన్ క్యాలిఫర్ అనే పరికరంలో పెట్టి పొడవు, వెడల్పు కొలుస్తారు. ధాన్యం గింజ పొడువు 6 ఎం.ఎం కంటే తక్కువగా.. గింజ వెడల్పు 2 ఎం.ఎం కంటే తక్కువగా ఉండాలి. ఈ పొడవు, వెడల్పుల నిష్పత్తి మొత్తం కలిపితే 2.5 ఎం.ఎం కంటే ఎక్కువగా ఉండాలి. అప్పుడే దాన్ని సన్నరకంగా పరిగణలోకి తీసుకుంటారు. పైగా ధాన్యం తేమ శాతం 17 శాతం కంటే ఎక్కువగా ఉండకూడదు. ఇచ్చే రూ.500 బోనస్‌కు ఇన్ని రకాల కొర్రీలు పెట్టిన సర్కారు రాష్ట్రంలో 48.91 లక్షల టన్నుల సన్న వరి దిగుబడి వస్తుందని, ఆ మొత్తానికి రూ.500 చొప్పున చెల్లించేందుకు రూ.2,445 కోట్లు అవసరమవుతాయని చెప్పుకుంటుంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది.

### మన జిల్లాలో 50 శాతం సన్నాలకు కోతే

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వరి ఎక్కువగా సాగవుతుంది. మంచిర్యాల జిల్లాలో వానకాలం సీజన్‌లో 3.30 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇందులో 65 శాతానికి పైగా సన్నాలే పండించారని అధికారులు చెబుతున్నారు. కాకపోతే మన జిల్లాలో ప్రభుత్వం చెప్పిన 33 రకాల కంటే ప్రైవేట్ కంపెనీలకు చెందిన సన్న రకాలనే ఎక్కువ మంది సాగు చేశారు. సాగైన సన్న ధాన్యంలో 50 శాతం నుంచి 60 శాతం అవే ఉంటాయని మండలాల్లోని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికమంది సాగు చేసిన ఓ సన్న రకం ధాన్యం సీడ్ సగం పిలకలు వచ్చి సగం రాకుండా ఉండిపోయిందని, దాంతో దిగుబడి కూడా తగ్గొచ్చని పేర్కొంటున్నారు. ఇక నిర్మల్ జిల్లాలో ఈ సీజన్‌లో 1.46 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి రానుంది. ఇందులో సన్న రకం ధాన్యం 45 శాతం వరకు ఉంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుండగా, ఇందులో సన్నాలు ఐదువేల మెట్రిక్ టన్నులు ఉండొచ్చని భావిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో పెద్దగా ధాన్యం కొనుగోళ్లు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే రైతులు సాగు చేసిన సన్న రకాలు.. అధికారులు పెట్టిన నిబంధనలతో సరిపోలడం లేదు. పొడవు, వెడల్పులు ప్రభుత్వం పెట్టిన సైజ్‌లో ఉండడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేట్‌కు విక్రయిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో ప్రస్తుతం ఇదే జరుగుతుంది. అధికారులు సైతం ఉద్దేశపూర్వకంగానే తేమశాతం, సైజ్ పేరుతో ధాన్యం కొనుగోలును జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు ఎక్కువగా ప్రైవేట్ దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కాగా, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో జరగడం లేదు. మంచిర్యాల 326, నిర్మల్ 233 సెంటర్లు, కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 34 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి వీటిలో పదిశాతం కేంద్రాల్లో కూడా ఇంకా కొనుగోళ్లు మొదలవ్వలేదు. నిర్మల్ జిల్లాలో 15 నుంచి 20 సెంటర్లలోనే కొనుగోలు చేస్తున్నారు.

**వీటికే బోనస్..**

రాష్ట్ర ప్రభుత్వం 33 రకాల సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించింది. ఆ 33 రకాలు ఏమిటంటే.. కంపసాగర్ వరి-1(కేపీఎస్2874), డబ్ల్యూజీఎల్ 44, జేజీఎల్ 27356, బీపీటీ 5204, జేజీఎల్ 28545, డబ్ల్యూజీఎల్ 32100, 14, జేజీఎల్ 384, జేజీఎల్ 11470, ఆర్ఎన్ఆర్15048, జేజీల్ 3828, ఆర్ఎన్ఆర్ 2458, డబ్ల్యూజీఎల్ 962, వరంగల్ వరి-1119, కేఎన్ఎం 733, ఆర్ఎన్ఆర్ 21278, జేజీఎల్ 3855, జేజీఎల్11118, జేజీఎల్ 3844, 1798, డబ్ల్యూజీఎల్ 347, ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్సీ), ఆర్ఎన్ఆర్ 2345, జేజీఎల్ 17004,ఆర్ఎన్ఆర్ 2465, ఎన్ఎల్ఆర్ 34449, ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్సీ), కేపీఎస్ 6251(పీఆర్సీ), జేజీఎల్ 33124(పీఆర్సీ), ఎంటీయూ 1262, ఎంటీయూ 1224 తదితర రకాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తారు.

### సన్న వడ్ల బస్తాకు ఎరుపు దారం.. దొడ్డు రకానికి ఆకుపచ్చ దారం

రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన సన్న రకం ధాన్యం పొడవు, వెడల్పు, తేమశాతం.. నిబంధనల మేరకు ఉండి.. 33 రకాల్లో ఒకటైతేనే దాన్ని సన్నరకంగా పరిగణలోకి తీసుకుంటారు. సన్న ధాన్యం నింపిన బస్తాలను ఎరుపు రంగు దారంతో కుడుతారు. అదే దొడ్డు రకాలైతే ఆకుపచ్చ రంగుతో కుడుతారు. రైతులు తీసుకెళ్లిన ధాన్యం ఏ రకంగా పరగణిలోకి తీసుకున్నారో తెలుసుకునేందుకు ఇది ఒక బండ గుర్తుగా పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు. సన్నరకాలను గుర్తించే పరికరాలు అన్ని కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. అనుమానాలుంటే మండల ఏఈవో పరికరంలో చూసి రైతులకు అవగాహన కల్పిస్తారు. కొనుగోలు కేంద్రాల్లో ఒకే.. అన్న తర్వాత మిల్లర్లు ఏమైనా ఇబ్బంది పెడితే వాటిని పరిష్కరించే బాధ్యతను సైతం ఏఈవోలకే అప్పగించారు. 24 గంటల్లో ఏఈవో స్థాయిలో దానికి పరిష్కారం లభించకపోతే డివిజన్ లెవవల్‌లో డీఈ సివిల్ సప్లయ్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ దాన్ని పరిష్కరిస్తారు. 48 గంటల్లోనూ అది పరిష్కారం కాకపోతే జిల్లా అగ్రికల్చర్ అధికారి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# గిరిజనుల సంక్షేమానికి కృషి



బీర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



ఉట్నూర్‌లో గిరిజనులకు తూకం మిషన్లు అందజేస్తున్న అధికారులు

### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 15 : గిరిజనుల జీవనప్రమాణాలు మెరుగుపరిచేందుకు ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ధర్తీ ఆబా భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతిని నిర్వహించారు. బీహార్ నుంచి దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద జిల్లాలో 33 ఆవాసాల్లో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి తాగునీరు, రహదారులు అటవీహక్కు చట్టం, విద్యుత్, వైద్య, సౌకర్యంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి చందన పథకం లక్ష్యాలు, అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా గిరిజన బాలికల నృత్యాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, వివిధ గ్రామాల గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

### బీర్సాముండా సేవలు మరువలేనివి

ఉట్నూర్, నవంబర్15 : భగవాన్ బీర్సాముండా సేవలు మరువలేనివని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం స్థానిక కుమ్రం భీం ప్రాంగణంలో బీర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని దేశ ప్రధాని ఆన్‌లైన్ ద్వారా జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకంపై వివరించారు. ఈ పథకం ద్వారా గిరిజనులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యువరాజ్, ఏపీవో వసంత్‌రావు, ఏపీవో పీవీటీజీ మనోహర్, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను కాపాడుకోవాలి

### కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత

సోన్, నవంబర్ 15 భూగర్భజలాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత అన్నారు. 'నారీ శక్తిసే జల్‌శక్తి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోన్ మండలంలోని వివిధ గ్రామాల్లో సాంకేతిక అధికారి సుశాంత్‌కుమార్‌తో కలిసి పర్యటించి భూగర్భజలాల సంరక్షణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. నీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు పరిశీలించి నీటి సంరక్షణకు చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ఇంకుడు గుంతల నిర్మాణంలో జిల్లా మెరుగైన స్థానంలో ఉండడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, మహిళ సంఘాల సభ్యులు, ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యానవన పంటలను పరిశీలన

లక్ష్మణచాంద, నవంబర్ 15 : మండలంలోని ఉద్యానవన పంటల తీరును శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అనిత పరిశీలించారు. మండలంలోని పొట్టపెల్లి గ్రామంలోని ఉద్యానవన ప్లాంటేషన్ పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. అనంతరం రాచాపూర్‌లో జామ తోటలను పరిశీలించారు. ఆమె వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీడీవో రాధిక, ఏపీవో ప్రమీల ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



రాచాపూర్‌లో జామతోటను పరిశీలిస్తున్న సీఎస్‌వో అనిత

# బస్తాకు మూడు కిలోలు అదనంగా కాంట

### కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన

బాసర, నవంబర్ 15 : బాసరలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణలో బస్తాకు 3 కిలోలు అదనంగా తూకం వేయడంతో రైతులు ఆందోళన చేశారు. బాసర మండల కేంద్రంలో గురువారం అధికారులు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొద్దిసేపటి తర్వాత నిలిపివేశారు. శుక్రవారం ఉదయం ఆరబోసిన వడ్లలో తేమ శాతాన్ని సిబ్బంది పరిశీలించారు. వడ్లు తూకం వేయడానికి సిద్ధం చేశారు. అంతలోనే సిబ్బంది 40 కిలోల బస్తాకు అదనంగా మూడు కిలోలు ఎక్కువగా తూకం చేయాలని హమాలీలకు సూచించడంతో రైతులు ఒక్కసారిగా అవక్కయ్యారు. గురువారం గోనె సంచి బరువుకు తూకంగా కిలో మాత్రమే అదనంగా తూకం వేశారని, ఈ రోజు రెండు కిలోలు అదనంగా తూకం వేయడంపై రైతులు ప్రశ్నించారు. దీంతో సిబ్బంది కొనుగోళ్లను నిలిపివేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు తహసీల్దార్ వద్దకు వెళ్లారు. అక్కడ తహసీల్దార్ లేక పోవడంతో వెనుదిరిగారు.



ఫిర్యాదు చేసేందుకు తహసీల్ కార్యాలయానికి వచ్చిన రైతులు

### అన్ని రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలి..

సన్న రకాల వడ్లకు రూ.500 బోనస్ వస్తుందని ఆశతో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని రైతులు తీసుకువచ్చారు. కొన్ని సన్న రకాల వడ్లకు మాత్రమే బోనస్ వస్తుందని తెలియడం, బస్తాకు 3 కిలోలు అదనంగా తూకం వేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని రకాల సన్నవడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

**3 కిలోలు అదనంగా తూకం వేయడం సరికాదు**



ఎంతో కష్టపడి పంటను పండించాం. నేను పండించిన పంటను సరైన సమయానికి కొంటలేరు. రోడ్డు మీద వడ్లను ఆరబెట్టాను. తేమ మిషన్‌లో కరెక్టుగా ఉన్నప్పటికీ సంచికి మూడు కిలోలు ఎక్కువ తూకం వేస్తాం అంటున్నారు. బస్తాకు రెండు కిలోలు నష్టపోతాం. అదనంగా తూకం వేయకుండా ధాన్యం కొనాలి. మా రైతులందరికీ న్యాయం చేయండి.

-ప్యాట్ల నగేశ్, రైతు బాసర

# చెక్‌పోస్ట్ వద్ద నిఘా ఏది ?

### ఇష్ట రీతిగా విధులు..సమయపాలన పాటించని బీట్ ఆఫీసర్లు

ఇచ్చోడ, నవంబర్ 15 : సిరికొండ అటవీ ప్రాంతం నుంచి కలప, ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు సిరిచెల్మ రేంజ్ అటవీ శాఖాధికారులు సిరికొండ, ఇచ్చోడ మండలాల సరిహద్దులోని పొన్న ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్(తనిఖీ కేంద్రం) వద్ద నిఘా కరువైంది. ఇక్కడ విధులు నిర్వహించే బీట్ ఆఫీసర్లు ఎప్పుడు వస్తారో పోతారో తెలియని పరిస్థితి నెలకొన్నది. గురువారం విధులు నిర్వహించాల్సిన ఫకీర్‌పేట్ బీట్ ఆఫీసర్ సుభాష్ ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాలేదు. శుక్రవారం మరో బీట్ ఆఫీసర్ విధులకు వచ్చే వరకు ఉండకుండా ఉదయమే వెళ్లిపోవడం జరిగింది. దీంతో ఇష్టారీతిలో విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా తీసుకున్న స్మగ్లర్లు యథేచ్ఛగా కలప, ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఎఫ్ఆర్వో నాగవత్ స్వామిని వివరణ కోరగా బీట్ ఆఫీసర్ సుభాష్ చెక్‌పోస్టు వద్ద విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




ఉదయం 10 గంటలకు బీట్ ఆఫీసర్ రాకపోవడంతో ఖాళీగా పొన్న ఎక్స్ రోడ్డు చెక్‌పోస్ట్